విద్యార్థులతో వైద్యాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్

పొగాకు క్యాన్సర్‌కు కారకం

డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 31 : పొగాకు సంపూర్ణ క్యాన్సర్ కారకమని డీఎంహెచ్‌వో గాయత్రీదేవి తెలిపారు. అంతర్జాతీయ పొగాకు నిరోధక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు, అందుకు సంబంధించిన పదార్థాలు వినియోగిస్తే ఆరోగ్యానికి హానికరమన్నారు. వీటితో పలు రకాల క్యాన్సర్లకు దారి తీస్తుందని తెలిపారు. యువత వీటికి దూరంగా ఉండాలని సూచించారు. సిగరెట్లు తాగడంతో పాటు వారు విడిచే పొగను పీల్చుకున్న క్యాన్సర్ వ్యాధులు ఎక్కువగా వస్తాయని, వీటిని బహిరంగ ప్రదేశాల్లో నిషేధించామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు వంద మీటర్ల దూరం వరకు ఎ లాంటి పొగాకు సంబంధిత వస్తువుల విక్ర యం, వాడకం నిషేధమన్నారు. గుట్కా, పొగాకు, బీడీలు, సిగరెట్లు తదితర వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం పొగాకు నిరోధకంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ శశాంక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యాధికారులు ప్రేమామృతం, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో అవగాహన కలిగిస్తున్న డాక్టర్ మధుకర్

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, మే 31 : పొగాకుతో చేసిన గుట్కా, సిగరేట్, గంజాయి వంటివి ప్రాణానికి హానికరమని పీహెచ్‌సీ వైద్యాధికారి మధుకర్ తెలిపారు. పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకును వాడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీనివాస్‌రావు, వసుంధర, సునీత, భిక్షపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, మే 31 : పొగ తాగితే ఆరోగ్యానికి హానికరమని పీహెచ్‌సీ వైద్యాధికారులు నృపేన్ చక్రవర్తి, గణపతిరావులు సూచించారు. మండలంలోని మీర్జాపూర్(బి), న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పుర స్కరించుకుని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొగాకుతో సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించారు. వాటిలో ఉండే రసాయనాలతో మెదడు, గుండె, ఊపిరితిత్తుల్లో రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. నరాల బలహీనతతో అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. అనంతరం ఆయా ఆరోగ్య కేంద్రాల్లో ధూమపానం వద్దు.. జీవితమే ముద్దు.. అంటూ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, మార్త, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో ..

బొల్లారం, మే 31 : పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పొగాకు నివారణకు సంబంధించిన ఫ్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పదవికే వీడ్కోలు.. వైద్య సేవకు కాదు

గుమ్మడిదల: ఎంపీహెచ్ఎస్ చంద్రకళ ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మడిదల, మే 31 : నిత్యజీవితంలో విధులు నిర్వహించిన ఉద్యోగానికి మాత్రమే వీడ్కోలు ఉంటుందని.. వైద్య సేవకు కాదని మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రమైన గుమ్మడిదలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఎస్‌గా విధులు నిర్వహించిన జీ.చంద్రకళావెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్పీటీసీ కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఘనంగా సన్మానించారు. వైద్యసేవలో చంద్రకళ చేసిన సేవలను కొనియాడారు. ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీని పకడ్బందీగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో బాలరాజు

కోహీర్, మే 31 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా చేపట్టాలని అదనపు డీఆర్డీవో బాలరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలకు ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని కావాలని అడిగిన వెంటనే ఈజీఎస్‌లో పని కల్పించాలని సూచించారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూయించాలని కోరారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో మొక్కలు ఎండిపోయే అవకాశం ఉందని వాటికి సకాలంలో నీటిని అందించాలన్నారు. మొక్కలు ఎండిపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీవో భారతి, ఏపీవో సునందరావు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దిపేట టౌన్, మే 31: సిద్దిపేట మోహినీపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణ ఘటాన్ని తిలకించి పునీతులయ్యారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు నిత్యహోమం, బాలభోగం, ఆరాధాన తదితర ప్రత్యేక పూజలు జరిగాయి.ప్రత్యేకంగా శశిధర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి అలరించింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ నగేశ్‌విష్ణు, ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

అమీన్ పూర్, మే 31 : మండల పరిధిలోని పటేల్‌గూడలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ)పనులను శుక్రవారం ఎంపీపీ దేవానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పనులు ఆగిపోయాయని, కొన్ని పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

పురుగు మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

సదాశివపేట, మే 31 : రైతులకు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని అదనపు కలెక్టర్ మాధురి డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సంగమేశ్వర ఏజెన్సీస్ పురుగు మందుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావుతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కృత్రిమంగా విత్తనాల కొరత సృష్టించినా, నకిలీ విత్తనాలను అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తహసీల్దార్ సరస్వతి, సీఐ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏవో అనిత పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

కోహీర్‌లో..

కోహీర్, మే 31 : నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని విజిలెన్స్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని కవేలి గ్రామ జాతీయ రహదారి పక్కన ఉన్న రెండు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. అనంతరం నాణ్యతను పరీక్షించేందుకు న మూనాలను సేకరించారు. డీలర్ల లైసెన్సులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల శంకర్, ఏవో నవీన్‌కుమార్, ఎ స్సై కృష్ణయ్య, ఫర్టిలైజర్ డీలర్లు నర్సింహులు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు

న్యాల్‌కల్, మే 23 : నకినీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని తహసీల్దార్ భూపాల్, వ్యవసాయాధికారి లావణ్యలు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గంగ్వార్, న్యాల్‌కల్, ముంగి గ్రామాల్లోని విత్తనాలు, ఎరువుల డీలర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ షాపుల్లో విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, నిల్వలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విత్తనాలను అనుమతి ఉన్న కంపెనీ నుంచి మాత్రమే తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్నూర్ ఎస్సై రామనాయుడు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే..

హత్నూర, మే 31 : ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని హత్నూర వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. శుక్రవారం హత్నూర మండలం కాసాల-దౌల్తాబాద్ రైతువేదికలో మండలంలోని ఎరువుల దుకాణ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దుకాణంలో ధరల పట్టికను అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు ధరలు, స్టాక్ వివరాలను వాటిపై రాసిపెట్టాలన్నారు. అనంతరం ఎస్సై సుభాశ్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వర ప్రతాప్, ప్రేంరాజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

వట్‌పల్లి, మే 31 : రైతులకు నాణ్యమైన

అదనపు కలెక్టర్ మాధురి

విత్తనాలనే విక్రయించాలని ఏడీఏ సత్యనారాయణ ఫర్టిలైజర్ డీలర్లకు వివరించారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఏడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేశ్ చౌహాన్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అందోల్, మే 31 : మండల పరిధిలోని జోగిపేటలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాల విక్రయాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ భాస్కర్, ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్, ఏవో విజయరత్న ఉన్నారు.

న్యాల్‌కల్ : గంగ్వార్ చౌరస్తాలోని విత్తనాల డీలర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి లావణ్య

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలి

ఎంపీపీ మొగులప్ప

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాయికోడ్, మే 31 : అధికారులు, ప్రజాప్రతినిధులు పారదర్శకంగా ఉంటూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని ఎంపీపీ మొగులప్ప అన్నారు. శుక్రవారం రాయికోడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు ఏర్పాటు చేసే సమావేశాలకు అధికారులు రాకపోవడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో రంగుమారిన జొన్నలను తీసుకోవాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మమతాశోక్, ఎంపీటీసీలు శివకుమార్‌పాటిల్, నవనిత, సత్తెమ్మ, వీణారాణి, శంకరమ్మ, పండరి, కృష్ణ, ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఉప తహసీల్దార్ విజయకుమార్, ఎస్సై వెంకట్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు అవినాశ్‌వర్మ, నర్సింహులు, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ నిఖిలా, రమేశ్, తహా, విజయలక్ష్మి, నీరాజా గ్రేస్, రమేశ్, శ్రీనివాస్, రామకృష్ణ,శ్యామ్‌లు ఉన్నారు.

రుణాలు చెల్లించాలని రైతులపై ఒత్తిడి

■ ఇబ్బంది పెడుతున్న బ్యాంకు అధికారులు ■ మండల సభలో సభ్యుల మండిపాటు



ఎంపీపీ రవీందర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జిన్నారం సర్వేనంబర్ ఒకటి భూ బాధితులు

జిన్నారం, మే 31 : రుణాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారని వైస్ ఎంపీపీ గంగురమేశ్ మండల సభలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలని రైతులకు ఫోన్‌లు చేసి ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుంటే క్రాఫ్ లోన్లు చెల్లించాలని ఒత్తిడి చేయడం, గ్రూపులో ఉన్న ఒకరిద్దరు తీసుకున్న రుణాలు చెల్లిస్తేనే అందరికీ లోన్లు మంజూరు చేస్తామని లింకు పెట్టారని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే బ్యాంకు అధికారులకు ఫోన్ చేయడంతో మేనేజర్ రాజు, ఫీల్డ్ ఆఫీసర్ రాంగోపాల్‌తో కలిసి వచ్చారు. మూడు, నాలుగేండ్ల క్రితం తీసుకున్న రుణాలను చెల్లించాలని ఫోన్‌లు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇంకా సమావేశంలో జడ్పీటీసీ ప్రభాకర్‌తో పాటు ఎంపీటీసీలు వెంకటేశంగౌడ్, లావణ్యానరేశ్, భార్గవ్‌లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి అభినందన సభ

నరేశ్ దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నగేశ్

రామచంద్రపురం, మే 31 : బస్సు డిపోలో 34 ఏండ్ల నుంచి ఆర్టీసీలో విశిష్ట సేవలు అందించిన గడీల నరేశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం రామచంద్రపురం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతిన గర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ దంపతులను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు నగేశ్ ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్, మొగులయ్య, శ్రీనివాస్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

న్యాల్‌కల్ :సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మారుతీరాథోడ్

న్యాల్‌కల్, మే 31 : రానున్న విద్యా సంవత్సరంలో డ్రాఫ్ అవుట్ లేకుండా బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు హెచ్ఎంలతో పాటు సంబంధిత అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు కృషి చేయాలని తహసీల్దార్ భూపాల్, ఎంఈవో మారుతీరాథోడ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నదన్నారు. కార్యక్రమంలో హెడ్నూర్ ఎస్సై రామనాయుడు, ఆర్ఐ దుర్గయ్య, ఐకేపీ ఏపీఎం కుమార్, హెచ్ఎంలు, సీఆర్‌పీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

సిర్గాపూర్, మే 31 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగాలని ఎంఈవో శంకర్ సూచించారు. శుక్రవారం సిర్గాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్ మండలాల అధికారులతో బడిబాట సమన్వయ సమావేశాన్ని ఎంపీడీవో మల్సూర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. జూన్‌లో నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు జూన్ 2లో పు పూర్తి చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. తహసీల్దార్లు ఉమాశంకర్, విష్ణుసాగర్, ఎంపీడీవో మల్సూర్, సంగ్రామ్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, సీఆర్‌పీ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

కోహీర్, మే 31 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 3న నిర్వహించే బడిబాటను విజయవంతం చేయాలని ఎంపీడీవో భారతి కోరారు. శుక్రవారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా పాఠశాలల హెచ్ఎం లు, క్లస్టర్ హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో శంకర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలి

కంది, మే 31 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో వెంకటనర్సింహులు కోరారు. జూన్ 3 నుంచి చేపట్టనున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కంది మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంఈవో మాట్లాడారు. సమావేశంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్వనిత, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బడిబాటలో భాగస్వాములు కావాలి

అందోల్, మే 31 : బడిబాటలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఈవో కృష్ణ కోరారు. శుక్రవారం ఎంపీడీవో అధ్యక్షతన చేసిన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉర్సుకు పోటెత్తిన జనం



దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లిలో ఉర్స్ ఉత్సవాలకు పోటెత్తిన భక్త జనసందోహం

రాయపోల్, మే 31: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లిలో శుక్రవారం సయ్యద్ షాదుల్లా బాబా దర్గా ఉర్సుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా వ్యవస్థాపకుడు సయ్యద్ రహీమ్(మహేశ్) భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఉర్సుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ దారా సత్యరారాయణ పేర్కొన్నారు.

బాలల స్వీయరక్షణకు కరాటే అవసరం

విద్యార్థులతో ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

రాయపోల్, మే 31: బాలల స్వీయరక్షణకు కరాటే అవసరమని రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశభోయిన నర్సింహులు అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో జిల్లా యువజన సంక్షేమం, క్రీడ లశాఖ సహకారంతో నిర్వహించిన కరాటే వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలో బాలికలు,మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వాటి నుంచి రక్షణ పొందడానికి కరాటే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు నరేందర్, పోలీస్ సిబ్బంది దేవరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నేతలు

మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సన్మానిస్తున్న బొల్లారం నాయకులు

బొల్లారం, మే 31: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రా రెడ్డి మంత్రిని సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, నాయకుడు లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుడికి నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 31: మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నారాయణఖేడ్ మండలం పలుగుతండాకు చెందిన టోప్యానాయక్(90) శుక్రవారం మృతి చెందిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, టోప్యానాయక్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కొండపాక(కుకునూరుపల్లి), మే 31 : తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి గోల్కొండ సాహితీ కళా సమితి కుసుమధర్మన్న కళాపీఠం పాలడుగు నాగయ్య కళా పీఠం లక్ష్య సాధానా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ వైతాళికుడు 128 జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు, రచయిత్రి ఇప్ప ఉమారాణి తన కవిత ఆహూతాలందరినీ తన కవితా గానంతో ప్రశంసలు అందుకున్నది. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఇప్ప ఉమారాణిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ పాలడుగు నాగయ్య, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి, సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు వెంకట్‌కృష్ణారెడ్డి, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

నిందితులను చూపుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి